నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | HYDERABAD




## ఆక్రమణల తొలగింపు

మియాపూర్ , ఫిబ్రవరి 15: చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్ మెట్రో నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌పై ఉన్న ఆక్రమణలను పోలీసు బలగాల తోడ్పాటుతో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తొలగిస్తున్నారు. చందానగర్ డీసీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ నాగిరెడ్డి టీపీఎస్‌లు శ్రీనివాస్ రెడ్డి రాకేశ్ తొలగింపు ప్రక్రియలను చేపడుతున్నారు.

## నిమ్స్ సెక్యూరిటీ నిరసన



ఖైరతాబాద్, ఫిబ్రవరి 15 : నిమ్స్‌లో సెక్యూరిటీ గార్డులు ఆందోళన బాటపట్టారు. తమకు రెండు నెలలుగా ఏజెన్సీలు వేతనాలు చెల్లించడం లేదంటూ శనివారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.



### రేపు నగరంలో నీటి సరఫరాలో
# అంతరాయం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో పలు ప్రాంతాల్లో సోమవారం నీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు అధికారులు ముందస్తుగా ప్రకటన విడుదల చేశారు. నగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేస్-1లోని కొండపాక పంపింగ్ స్టేషన్ వద్దనున్న 3000 ఎంఎం డయా, ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు 900 ఎంఎం డయా వాల్వ్‌లు అమర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 6గంటల నుంచి మరుసటి రోజు మంగళవారం ఉదయం 6గంటల వరకు పనులు జరగనున్న నేపథ్యంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్, బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంగళ్‌రావు నగర్, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఫతేనగర్. కూకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానంద నగర్, ఎల్లమ్మబండ, మూసాపేట్, భరత్‌నగర్, మోతీనగర్, గాయత్రీనగర్, బాబానగర్, కేపీహెచ్‌బీ, బాలాజీ నగర్, హస్మత్‌పేట్, హఫీజ్‌పేట్, మియాపూర్, కొంపల్లి, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం, డివిజన్-22లోని నిజాంపేట, బాచుపల్లి, ప్రగతినగర్, గండి మైసమ్మ, తెల్లాపూర్, బొల్లారం, , త్రిశూల్ వైన్స్, గన్‌రాక్, హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బీబీనగర్ ఎయిమ్స్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆఫ్ టేక్స్ ప్రాంతాలైన ప్రజ్ఞాపూర్(గజ్వేల్), ఆలేర్(భువనగిరి), ఘన్‌పూర్(మేడ్చల్/శామీర్‌పేట) తదితర ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.



| ఏడాది | ఏబీసీ(కుక్కల సంఖ్య) | ఏఆర్ | ఖర్చు(రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2022-23 | 36,890 | 63,025 | 9.02 |
| 2023-24 | 53,375 | 86,303 | 12.84 |
| 2024-25 | 33,395 | 70,247 | 7.80 |
| (15డిసెంబర్2024) | | | |

రెచ్చిపోతున్న వీధి కుక్కలు.. చిన్నారుల ప్రాణాలను తీస్తున్న వైనం

ప్రమాదకరమైన, దీర్ఘకాలిక రోగాల బారిన పడిన కుక్కలపై కొత్త అస్త్రం

యూథనేసియాకు అనుమతి ఇవ్వాలంటూ హైకోర్టును కోరిన బల్దియా

# శునకాగ్రహం..

**ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. తగ్గని కుక్కకాట్లు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. మొన్న రాజేంద్రనగర్...నిన్న ఉప్పల్‌లో చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఇలా వరుస సంఘటనలు చిన్నారుల తల్లిదండ్రులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది..చిన్నారులను మొదలుకొని మహిళలు, వృద్ధుల వరకు ఎవరినీ వదలడం లేదు. బయట మనిషి కనబడితే చాలు కరిచి పడేస్తున్నాయి.. పగబట్టినట్లే ప్రవరిస్తూ కండలు పీకేస్తూ ప్రాణాలను తీస్తున్నాయి. నిత్యం ఏదో ఒక చోట జనాలు కుక్క కాటుకు బలవుతున్న పరిస్థితి. వందలాది మందిని దవాఖానలకు గురి చేస్తున్నాయి. నారాయణగూడలోని ఐపీఎం (ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్)కు కుక్క కాట్లతో దాదాపు 100 మందికి పైగా బాధితులు క్యూ కడుతున్నారంటే కుక్కల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక జీహెచ్ఎంసీ వీధి కుక్కల నియంత్రణను గాలికి వదిలేసింది. తూతూ మంత్రంగా నియంత్రణ చర్యలు చేపడుతున్నది. ప్రధానంగా వీధి కుక్కలకు ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్స్) ఆపరేషన్లేగాక, రేబిస్ నివారణ టీకాలను వేయడంలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం వహిస్తోంది. ఏబీసీ ఆపరేషన్లు పెంచేందుకు మూడు జోన్లలో జంతు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు విషయంలోనూ ఆలసత్వం ప్రదర్శిస్తున్నారు. ప్రధానంగా రాబోయే వేసవిలో ఒక పక్క ఎండవేడి, మరోపక్క చెత్త వ్యర్థాల డంపింగ్ వద్ద నిల్వ ఉన్న వ్యర్థాలను తినడం వల్లే కుక్కల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుని, కనిపించిన వారిపై పిచ్చికోపంతో దాడులకు తెగబడే అవకాశాలు లేకపోలేదు. సహజంగా ఎండాకాలంలో తాగునీటి వసతి తక్కువగా ఉండడంతో వేడి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వీధి కుక్కల్లో ప్రకోపనం (ఇరిటేషన్) అధికంగా ఉంటుంది. వీధి కుక్కలకు సంతాపన నిరోధక శస్త్ర చికిత్సలు, వ్యాక్సిన్లు చేశామని చెబుతున్నా..పెరుగుతున్న వరుస కుక్క కాట్లు అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నాయి.

### మూడేండ్లలో ఏబీసీ, ఏఆర్‌లకు రూ. 29.67 కోట్లు

జీహెచ్ఎంసీ పరిధిలో 3.79 లక్షల వీధి కుక్కలుండగా.. వీటిలో 77 శాతం కుక్కలకు మాత్రమే స్టెరిలైజేషన్ చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.. కుక్కల నియంత్రకు 'కంట్రోల్ ఆఫ్ స్ట్రే యానిమల్స్' హెడ్ పేరుతో ప్రతి ఏడాది నిధులు కేటాయిస్తున్నారు. స్టెరిలైజేషన్స్, వ్యాక్సినేషన్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఇతర జంతువుల సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు మూడేండ్లలో రూ.29.67కోట్లు ఖర్చు చేశారు. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), యాంటీ రేబిస్(ఏఆర్) కార్యక్రమాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అయినా 70 శాతం కుక్కలకు ఆపరేషన్లు కూడా చేయలేదని అధికారిక లెక్కలు చెబుతుండటం గమనార్హం.



### ప్రమాదకరమైన కుక్కలను..

ప్రమాదకరమైన, దీర్ఘకాలికంగా రోగాలబారిన కుక్కలను నియంత్రించేందుకు ఉన్న చట్టాలను పట్టించుకోలేదనే విమర్శలూ లేకపోలేదు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఎంతో మంది చిన్నారులు కుక్కల దాడుల్లో మరణించారు. ఈ క్రమంలోనే 2023లో అంబర్ పేట నాలుగేండ్ల బాలుని కుక్కల పీక్కుతున్న సంఘటను హైకోర్టు సుమోటగా స్వీకరించింది. ఈ కేసు నేపథ్యంలో కుక్కల నియంత్రణ ఖర్చు వివరాలు, ప్రమాదకరమైన కుక్కలను చంపడానికి అనుమతివ్వాలని హైకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ క్రమంలోనే వీధి కుక్కల నియంత్రణకు జీహెచ్ఎంసీ కొత్త పంథాను ఎంచుకుంది. 1960 ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ యాక్ట్ 1960లోని సెక్షన్ 11(3)(బీ), 11(3)(సీ), జీహెచ్ఎంసీ 1955 చట్టంలోని సెక్షన్ 249 ప్రకారం ప్రమాదకరమైన, దీర్ఘాకాలిక రోగాల బారిన పడిన కుక్కలను యూథానేసియా(మెర్సీ కిల్లింగ్) ద్వారా (కుక్కలకు స్టెరిలైజేషన్ సమయంలో మత్తు ఇంజెక్షన్లను ఎక్కువ మోతాదులో ఇచ్చి చంపడం) చంపడానికి అనుమతివ్వాలని జీహెచ్ఎంసీ హైకోర్టును కోరింది. అయితే దీనిపై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటనేది వేచి చూడాల్సిందే. ఒకవేళ మెర్సీ కిల్లింగ్‌కి హైకోర్టు అనుమతిస్తే యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారమే ప్రాసెస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. 2008లో బాంబే హైకోర్టు, 2015లో కేరళ హైకోర్టులు కుక్కలను మెర్సీ కిల్లింగ్‌కి అనుమతిచ్చాయి. ఈ అంశాన్ని సవాల్ చేస్తూ యానిమల్ యాక్టివిస్టులు సుప్రీం కోర్టుకు వెళ్లారు. కేంద్ర పశుసంవర్ధక శాఖ కూడా 2022లో తెచ్చిన యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్‌లో మెర్సీ కిల్లింగ్‌ను సమర్థించింది.

### ఏడబ్ల్యూవోకు రూ.9.18కోట్లు

కుక్కల నియంత్రణలో భాగంగా స్టెరిలైజేషన్, యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలను నిర్వహించే యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్(ఏడబ్ల్యూవో)లకు జీహెచ్ఎంసీ నుంచి ఆర్థికంగాను, లాజిస్టికల్ గాను చేయూతనందిస్తున్నది. ఐదు సంస్థలకు కుక్కల ఆపరేషన్లు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఐదేండ్లలో రూ.9.18కోట్లు ఖర్చు చేశారు.

| ఏడాది | ఏబీసీ/ఏఆర్(కుక్కల సంఖ్య) | ఖర్చు(రూ.కోట్లలో) |
|---|---|---|
| 2020-21 | 9,226 | 1.38 |
| 2021-22 | 24,720 | 3.70 |
| 2022-23 | 12,257 | 1.83 |
| 2023-24 | 8,725 | 1.30 |
| 2024-25 | 6,474 | 97లక్షలు |
| (15డిసెంబర్2024) | | |
| మొత్తం | 61,402 | 9.18 |





# స్వల్పంగా తగ్గి..

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు నిన్నటితో పోల్చితే స్వల్పంగా తగ్గాయి. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 35.0, కనిష్ఠం 17.3, గాలిలో తేమ 29 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# ఆడుకుంటూ వెళ్లి.. సంపులో పడి

సైదాబాద్, ఫిబ్రవరి 15: ఆడుకుంటూ వెళ్లి సంప్‌లో పడి ఐదేండ్ల బాలుడు మృతి చెందిన సంఘటన ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా దుగ్గిళ్ళ గ్రామానికి చెందిన శ్రీను నాయక్, అనుష దంపతులు నగరానికి వచ్చి సంతోష్ నగర్‌లో ఓ అపార్ట్‌మెంట్ వద్ద పని చేస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. వీరి కుమారుడు జయ శివన్ (5) వారు పని చేసే సమీపంలో ఉన్న సంప్ వద్దకు సోదరితో కలిసి ఆడుకోవడానికి వెళ్లాడు. అక్కడ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సంపులో పడి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



### అలరించిన నృత్య ప్రదర్శనలు

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# ఒక్కటైనా పూర్తి చేద్దాం

ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను వేగవంతం చేయనున్న హెచ్ఎండీఏ

రైతుల నుంచి 300 ఎకరాల భూమి సమీకరణ

సిటీబ్యూరో: మార్కెట్‌లో అమ్మకాలు లేవు. ప్రభుత్వ విధానాలతో పెట్టుబడిదారులు ముందుకు రావడం లేదు. ఇక భూములను వేలం వేయడం కంటే... ముందుగా భూములను సమీకరించుకోవడమే ఉత్తమమనే భావన హెచ్ఎండీఏ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. కొంత కాలంగా ల్యాండ్ పూలింగ్ వ్యవహారం పెండింగ్‌లో పడిన నేపథ్యంలో.. తాజాగా ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో ఒక్కటైనా పూర్తి చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ముఖ్యంగా చివరి దశలో ఉన్న కొర్రెముల భూములను రైతుల నుంచి సేకరించి ఒక్కటైనా విజయవంతంగా పూర్తి చేస్తే సరిపోతుందనే భావనలో ఉన్నారు. ఓ వైపు మార్కెట్ పరుగులు పెడుతుందని, క్రయవిక్రయాలు జోరందుకున్నాయంటూ ప్రభుత్వ వర్గాలు ఊదరగొడుతున్నా... క్షేత్రస్థాయిలో అమ్మకాల తీరు తిరోగమనంలోనే కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో... చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ల్యాండ్ పూలింగ్ ద్వారా కనీసం 300 ఎకరాలను సేకరిస్తే సరిపోతుందని అనుకుంటున్నారు.

### మార్కెట్ డౌన్ ట్రెండ్..

హైదరాబాద్ కేంద్రంగా రియల్ మార్కెట్ డౌన్ ట్రెండ్ కొనసాగుతున్నది. అయితే ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను దశల వారీగా పూర్తి చేయాలని హెచ్ఎండీఏ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే నగర శివారులో 900 ఎకరాల భూములను సమీకరించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో పలు ప్రాంతాలను ఎంపిక చేసుకోగా, ప్రజాభిప్రాయ సేకరణ కూడా పూర్తి చేశారు. ఇందులో ప్రధానంగా మేడ్చల్ జిల్లా పరిధిలోని కొర్రెములలో దాదాపు 300 ఎకరాలు సమీకరించాలనేది ప్రస్తుత లక్ష్యమని తెలిసింది.

### గిట్టుబాటు ధర లేక..

హెచ్ఎండీఏ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా భూసమీకరణ చేయాలనే ప్రతిపాదనలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉండటానికి ప్రధాన కారణాల్లో గిట్టుబాటు ధర లేకపోవడం. గడిచిన పదేండ్లలో భూముల ధరలు రాకెట్ వేగంతో పెరగడంతో... భూములు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. 40 శాతం నుంచి 60 శాతానికి పరిహారాన్ని పెంచినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్రమంలో పలు దఫాలుగా రైతులతో సంప్రదింపులు, నోటిఫికేషన్లు జారీ చేసినా... ఆచరణలో సాధ్యం కాలేదు. ఇలాంటి నేపథ్యంలోనే కొర్రెముల ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేయడం వల్ల మార్కెట్ ఆటుపోట్లకు సమాధానం దొరుకుతుందని హెచ్ఎండీఏ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ క్రమంలో తొలి దశలో 300 ఎకరాల భూమిని తీసుకుంటే సరిపోతుందని అధికారులు భావిస్తున్నారు. ఆ తర్వాతే అబ్దుల్లాపూర్‌మెట్, కుత్బుల్లాపూర్, బాలాపూర్ మండలాల పరిధిలో భూ సమీకరణ చేపట్టాలనే ప్రణాళికలు ఉన్నట్లుగా తెలిసింది. ప్రస్తుతం ఉన్న ప్రతికూల మార్కెట్ పరిస్థితుల నుంచి కూడా బయటపడే అవకాశం ఉంటుందని హెచ్ఎండీఏ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.



# అపరిశుభ్రంగా వంట గదులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారస్తులపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారుల చర్యల పరంపర కొనసాగుతున్నది. ఈ మేరకు శనివారం ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. మలక్‌పేట గంజ్‌లో జీఎల్ గానుగ నూనె, లిమ్రా వ్యాపారులు, శ్రీ సాయి బాలాజీ ఎంటర్ ప్రైజెస్, ముఖేష్ ట్రేడింగ్ కో కృపా మార్కెట్, యూసుఫ్‌గూడలోని శ్రీ సాయి రామ టిఫిన్స్, రాయులు వారి రుచులు, హాట్ చిప్స్, శ్రీనివాస కిరణాలు, చందానగర్‌లోని రుచిబా రెస్టారెంట్, శ్రీ వెంకటేశ్వర ఎంటర్ ప్రైజెస్, మెహిదీపట్నం కింగ్స్ ఫుడ్ జోన్, అరేబియన్ బైట్స్, చైనీస్ ఫాస్ట్ ఫుడ్, కూకట్‌పల్లి హాజెల్ నట్‌లో తనిఖీలు చేపట్టారు. పదార్థాల నమూనాలను సేకరించి ల్యాబ్ పంపారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. పటాన్‌చెరు ఐడీఏ ఆసటి రాజ్‌కుమార్ రోలర్స్ ఫ్లోర్ మిల్లర్స్ ప్రై.లిలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చారు. గోడలు, పైకప్పులు పాచిగా ఉన్నాయని, ఎలుకలు, పావురాలు, పిచ్చుకల వంటి పక్షుల మలం ఉన్నట్లు గుర్తించారు. అపరిశుభ్రమైన వాతావరణంలో ఉందని తేల్చిన అధికారులు.. నిర్వాహకుడికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.



### సేవాలాల్ మహారాజ్‌కు ఘన నివాళి

మహేశ్వరం నియోజకవర్గంలోని ఉప్పు గడ్డ తండా, లెనిన్ నగర్, మీర్ పేట లో జరిగిన సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పాల్గొన్నారు. సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేనన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. -బడంగ్‌పేట ఫిబ్రవరి 16

# కుల గణనలో నమోదు కాలేదా?

ఉ. 9 నుంచి సా.5 వరకు బల్దియా కాల్ సెంటర్ అందుబాటులో..

**కాల్ 040-21111111**

సిటీబ్యూరో: కుల గణనలో ఇప్పటి వరకు నమోదు కానీ వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ 040-21111111 నంబర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కాల్ సెంటర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుంది. ఇప్పటి వరకు కుల గణనలో నమోదు కానీ కుటుంబ సభ్యులు మాత్రమే కాల్ సెంటర్‌కు కాల్ చేసి వారి, మొబైల్ నంబర్, అడ్రస్‌తో పాటుగా పోస్టల్ పిన్ కోడ్ నంబర్‌ను తెలియజేయాల్సి ఉంటుందన్నారు. కాల్ సెంటర్‌లో కాల్ వచ్చినప్పుడు ఆపరేటర్ చేయాల్సిన నియమ నిబంధనలపై శనివారం కంప్యూటర్ ఆపరేటర్లకు కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ అవగాహన కల్పించారు. కాల్ సెంటర్‌లో ఆపరేటర్ అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ కాల్ సెంటర్ జీహెచ్ఎంసీ పరిధితో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన కాల్స్ కూడా స్వీకరించి, సంబంధిత వివరాలను సంబంధిత జిల్లా కలెక్టర్లకు ఫార్వర్డ్ చేస్తారని పేర్కొన్నారు. అయితే కాల్ చేసే వ్యక్తి పూర్తి వివరాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఫోన్ నంబర్, పూర్తి అడ్రస్, పిన్ కోడ్ నంబర్ తెలియజేయాల్సి ఉంటుంది.

### 16 నుంచి 28 వరకు ..

కులగుణనలో నమోదు కాని వారి కోసం ప్రభుత్వం ఈ నెల 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మరోసారి సర్వే కొనసాగిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాల్ సెంటర్ ద్వారా పేరు, వీధి, గ్రామం, మొబైల్ నంబర్, ఇంటి నంబర్, పట్టణాల్లో అయితే సర్కిల్ లేదా వార్డు నంబర్ వివరించిన పక్షంలో అడ్రస్ ప్రకారం ఎన్యుమరేటర్ వారి ఇంటికి వెళ్లి కులగణన చేస్తారు. మొబైల్ నంబర్‌తో సెర్చ్ చేసి సంబంధిత వ్యక్తి పాత డేటా బేస్‌లో నమోదు అయ్యారా లేదా వివరాలు ఉన్నాయా అన్నది పరిశీలించి, లేని పక్షంలో సంబంధిత వ్యక్తి, పేరు, అడ్రస్ అడుగుతారు. ముందుగా జీహెచ్ఎంసీనా లేదా నాన్ జీహెచ్ఎంసీనా అన్న వివరాలు అడుగుతారు. జీహెచ్ఎంసీ పరిధి కానటువంటి వారైతే మున్సిపాలిటీ వార్డు నంబర్, అడ్రస్, గ్రామం అయితే మండలం అడుగుతారు. ఆ వివరాలను తెలియజేసిన పక్షంలో ఎన్యుమరేటర్ ఇంటి వద్దకు వచ్చి సర్వే చేస్తారన్నారు.

### నేడు పలు ప్రాంతాల్లో అవగాహన

గతంలో జరిగిన బీసీ కులగణనలో పాల్గొనని వారికి మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు చాంద్రాయణగుట్ట పరిధిలోని కుమ్మరివాడి బస్తీలో ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్ మలక్‌పేట పరిధిలోని ముసారాంబాగ్ శాలివాహన నగర్‌లో, తిరుమలగిరి సురేందర్ గచ్చిబౌలిలోని టీఎన్జీఓస్ కాలనీ పరిధిలోని క్యూసిటీలో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.